## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే బాలూనాయక్



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), మే 2 : పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. నియోజకవర్గంలోని 205 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.68.78 లక్షల విలువైన చెక్కులను శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన అందించారు. అనంతరం పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బిక్కునాయక్, నాయకులు పాపానాయక్, హరికృష్ణ, రాంసింగ్, వడ్త్య దేవేందర్‌నాయక్, బాబురాం, సుభాశ్, వెంకట్రాం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను సర్వే చేయాలి

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 2 : మునుగోడు మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు ఎన్ని ఆక్రమణలకు గురయ్యాయి, ఎన్ని ఉన్నాయనే విషయమై రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు అవసరమయ్యే స్థలానికి సంబంధించి మునుగోడులోని క్యాంప్ కార్యాలయంలో గురువారం రాత్రి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ స్థలంపై ఆరా తీశారు. ఇంటిగ్రెటెడ్ స్కూల్‌తో పాటు భవిష్యత్‌లో ప్రజల అవసరాలకు ఉపయోగ పడేలా చేపట్టే నిర్మాణాలకు ప్రభుత్వ భూమి అవసరం ఉందన్నారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపై జిల్లా పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన డీపీఓలు, చండూరు ఆర్డీఓ శ్రీదేవి, తాసీల్దార్ నరేందర్, డీటీ నరేశ్ పాల్గొన్నారు.

## హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి

● డీఎల్‌పీఓ వెంకటేశం



కట్టంగూర్‌లోని దాబా పరిసరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వెంకటేశం

కట్టంగూర్, మే 2 : హోటళ్ల నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలని, ఆహారం విషయంలో నాణ్య తా ప్రమాణాలు పాటించాలని డీఎల్‌పీఓ వెంకటేశం ఆదేశించారు. శుక్రవారం కట్టంగూర్‌లో హైవే వెంట ఉన్న హోటళ్లు, దాబాలను ఆయన తనిఖీ నిర్వహించారు. హోటళ్లు, దాబాల్లో పరిశుభత పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాడే పదార్థాలు రోజుల తరబడి నిల్వ ఉంచకూడదని, వంట సామగ్రిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీఓ చలపతి, పంచాయతీ కార్యదర్శి వడ్ల కొండ అశోక్‌గౌడ్ ఉన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

త్రిపురారం, మే 2: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అశ్విత స్వచ్ఛంద సంస్థ సహకారంతో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు మాలోతు సంజయ్ మాట్లాడుతూ 18 ఏండ్లలోపు అమ్మాయిలకు, 21 ఏండ్ల లోపు అబ్బాయిలకు వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు కవిత, సీహెచ్‌ఓ తావునాయక్, సూపర్‌వైజర్లు కమలమ్మ, ఏఎన్‌ఎంలు నూర్జహన్, జ్యోతి, వీణ, ఆరోగ్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



డాక్టర్ విజయ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న ఆశ వర్కర్లు

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ

నార్కట్‌పల్లి, మే 2 : ఈ నెల 20న సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న అన్నారు. శుక్రవారం ఆశ వర్కర్లతో కలిసి పీహెచ్‌సీ డాక్టర్ విజయకుమార్‌కు సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో తుమ్మల నాగలక్ష్మి, అల్లె కరుణ, భాగ్య, పద్మ, మంగమ్మ, నర్సిమ్మ, వెంకటమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, మే 2 : మండంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలోని సంజీవని ట్రస్ట్ వద్ద శుక్రవారం బైక్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండం మేడారం గ్రామానికి చెందిన చెనమోని సత్యం(55) బైక్‌పై చేపలు అమ్ముకుంటు జీవనోపాధి పొందుతున్నాడు. కొండమల్లేపల్లిలో చేపలు అమ్ముకొని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలోని సంజీవని ట్రస్టు సమీపంలో ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దాంతో తీవ్రంగా గాయపడిన సత్యం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

# పశుగ్రాసం కోసం రైతుల పాట్లు

## వరికోత యంత్రాలతో చేతికందని గడ్డి

ముక్కలు అవ్వడంతో నిల్వ చేసేందుకు ఇబ్బందులు
ట్రాక్టర్ వరిగడ్డి రూ.15 నుంచి 20వేలు
పశువులకు మేత లేక రైతుల అవస్థలు



గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న రైతులు

కొండమల్లేపల్లి, మే 2 : వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాక రైతన్నలకు పశుగ్రాసం కష్టాలు తప్పడం లేదు. దేవరకొండ నియోజకవర్గంలో యాసంగిలో వరి విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే పెరిగినప్పటికీ వరి గడ్డి మాత్రం దొరకడం లేదు. యంత్రాల ద్వారా వరి కోతలు చేపట్టడంతో గడ్డి మొత్తం ముక్కలుగా మారడంతో కట్టలు కట్టడానికి వీల్లేకుండా పోతున్నది. వరి సాగు చేసిన రైతులు కూలీల కొరతతో పాటు ఖర్చు కూడా పెరుగుతుండడంతో వరికోతలకు యంత్రాలు వినియోగిస్తున్నారు. యంత్రాల వినియోగం వల్ల గడ్డి రాకపోవడంతో పశుగ్రాసం విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు. అయితే ముక్కలుగా మారిన గడ్డిని సేకరించి కట్టలు కట్టే యంత్రాలు సైతం అందుబాటుకి రావడంతో కొంత మంది వాటిని వినియోగించి గడ్డిని సేకరించి విక్రయిస్తున్నారు.

**ట్రాక్టర్ గడ్డి రూ.15 నుంచి 20వేలు**

కొండమల్లేపల్లి మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ ఏడాది 730 ఎకరాల్లో వరి సాగు చేశారు. అయినా గడ్డిని సేకరించక పోవడంతో పశుగ్రాసం కొరత తీవ్రంగా నెలకొంది. దాంతో పశువుల పెంపకం దారులు బయటి ప్రాంతాల నుంచి గ్గిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. ఒక్కో గడ్డి కట్టకు రూ.200 నుంచి రూ.250 వరకు వెచ్చిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఒక ట్రాక్టర్ పశు గ్రాసానికి రూ.15 నుంచి 20 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. దాంతో పాటు దూర ప్రాంతాల నుంచి పశుగ్రాసాన్ని తీసుకొచ్చేందుకు అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు పశుగ్రాసం కొనుగోలు చేయలేక పశువులను విక్రయిస్తున్నారు.



తేమ లేకుండా ఆరేందుకు పొలంలో ఉంచిన గడ్డి కట్టలు

**గడ్డిని సేకరించి నిల్వ ఉంచాలంటే**

యంత్రాలతో వరి పొలాన్ని కోసిన తర్వాత వచ్చే గడ్డిని యంత్రం సాయంతో సేకరించి కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే ఏడాది పాటు నిల్వ చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పొలంలో యంత్రం ద్వారా వరి కోసిన తర్వాత గడ్డిని యంత్రం సాయంతో సేకరించాలి. ఒక్కో గడ్డి పనను గట్టిగా కట్టాలి. అనంతరం వాటిని ఒక ప్రాంతానికి చేర్చి గడివాము వేయాలి. ఈ సమయంలో పైకప్పు ఏటవాలుగా ఉండేలా చూసుకొని వాటిపై టార్పాలిన్, ప్లాస్టిక్ కవర్లను కప్పి ఉంచాలి. దాంతో వర్షాకాలంలో గడ్డిలోకి నీరు వెళ్లకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.

**గడ్డి దొరకట్లేదు..**



ప్రస్తుతం మిషన్లతో వరి కోయిస్తుండడంతో పశువులకు గడ్డి దొరకడం కష్టంగా మారింది. గతంలో కూలీలతో కోతలు చేయడం వల్ల గడ్డికి కొరత ఉండక పోయేది. కూలీలతో కోయించిన గడ్డి పూర్తిగా రావడంతో నిల్వ చేసేందుకు వీలుగా ఉండేది. కానీ ప్రస్తుతం ఆయకట్టేతర ప్రాంతాల వారికి ప్రశుగ్రాసం దొరకడం కష్టంగా మారింది.

–మూడావత్ హనుమానాయక్, రైతు, పెండ్లిపాకల, బాబ్లతండా

## బీఆర్‌ఎస్ నాయకుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

కట్టంగూర్, మే 2 : బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండలాక్షుడు గోగు బాలసైదులు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం బాలసైదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. నివాళులర్పించిన వారిలో మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, తరాల బలరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, వివిధ పార్టీల నాయకులు పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సయ్య, మిట్టపల్లి శివ, ముక్కాముల శేఖర్, మర్రి రాజు, బీరెల్లి ప్రసాద్, వడ్డె సైదిరెడ్డి, లకుమాల మధు, గండమల్ల అంత య్య, రేకల భిక్షం, గుల్లి నరేశ్ ఉన్నారు.

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బోయపల్లి శంకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట కొండూరు శంకర్, బోయపల్లి నర్సింహ ఉన్నారు.

**ఆకారం ఆటో యూనియన్ ఎన్నిక**

శాలిగౌరారం, మే 2 : మండలంలోని ఆకారం గ్రామ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు విజయ్, ఉపాధ్యక్షుడిగా గద్దల బాబ్జి, గౌరవాధ్యక్షుడిగా పాపయ్య, కమిటీ సభ్యులుగా దార అశోక్, రాములు, శ్రీను, శ్రీకాంత్, సందీప్ ఎన్నికయ్యారు.

## లిటిల్ సోల్జర్స్‌కు యంగ్ ఇండియా సేవా పురస్కారం



యంగ్ ఇండియా సేవా పురస్కారం అందుకుంటున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్, మే 2 : పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన నకిరేకల్ పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, కర్నాటి నరేశ్‌కు యంగ్ ఇండియా 2025 సేవా పురస్కారం లభించింది. గురువారం రాత్రి నాంపల్లి నెహ్రూ ఆడిటోరియంలో యంగ్ ఇండియా బ్లడ్ డోనర్స్ క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో యంగ్ ఇండియా సేవా పురస్కారాన్ని లిటిల్ సోల్జర్స్ ప్రతినిధులకు అందించారు. ఏడు సంవత్సరాలుగా వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు అవార్డును అందించారు. కార్యక్రమంలో మిషన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్, సీఐ ఏడుకొండలు, యంగ్ ఇండియా బ్లడ్ డోనర్ క్లబ్ చైర్మన్ బాలు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా సునీల్



నియామక పత్రం అందుకుంటున్న సునీల్

చందంపేట(దేవరకొండ), మే 2 : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా సి.సునీల్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్ నియామక పత్రాలు జారీ చేయగా శుక్రవారం దేవరకొండలో నిర్వహించిన సంఘం సమావేశంలో నాయకులు వారికి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, దామోదరాచారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ‘పది’లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్

రామగిరి, మే 2: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన నల్లగొండలోని మైనార్టీ బాలికల గురకుల పాఠశాల విద్యార్థినులను శుక్రవారం సన్మానించారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 100 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌ఓ విష్ణుమూర్తి, ప్రిన్సిపాల్ షాహిన్ షేక్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**గుడిపల్లి జడ్పీ ఉన్నత విద్యార్థులకు..**

పెద్దఅడిశర్లపల్లి : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన గుడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గోలి గిరి మాట్లాడుతూ పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేసిన ఎంఈఓ శ్రీనయ్య, పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాకులను అభినందించారు. కార్యక్రమంలో అర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి, శ్యామ్ , రాంబాబు, ఈశ్వర్, బక్కమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్న సీఎస్ ఫౌండేషన్ చైర్మన్ గోలి గిరి

## కొండమల్లేపల్లి తాసీల్దార్‌గా నరేందర్



తాసీల్దార్ నరేందర్

కొండమల్లేపల్లి, మే 2 : కొండమల్లేపల్లి తాసీల్దార్‌గా నరేందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన తాసీల్దార్ ఎండీ అన్వర్ హుస్సేన్ అడవిదేవులపల్లికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మునుగోడు తాసీల్దార్‌గా పని చేస్తున్న నరేందర్ కొండమల్లేపల్లికి వచ్చారు. డీటీ ప్రశాంత్, కార్యాలయ సిబ్బంది అయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## గుర్రంపోడ్ తాసీల్దార్‌గా శ్రీనివాస్



బాధ్యతలు చేపట్టిన తాసీల్దార్ శ్రీనివాస్

గుర్రంపోడ్, మే 2: గుర్రంపోడ్ తాసీల్దార్‌గా పి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన జి.కిరణ్‌కుమార్ ఫిబ్రవరిలో సస్పెండ్ కావడంతో అప్పటి నుంచి డీటీ మహ్మద్ ఫరీదొద్దీన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో నల్లగొండ తాసీల్దార్‌గా పని చేస్తున్న పి.శ్రీనివాస్ వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రశాంతంగా టీఎస్‌ఎప్‌సెట్

రామగిరి, మే 2: టీఎస్ ఎప్‌సెట్–2025 ఆన్‌లైన్ పరీక్షలు నల్లగొండలోని ఎస్పీఆర్ ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో శుక్రవారం ప్రశాంతగా కొనసాగాయి. ఉదయం సెషన్‌కు 185 మందికి 182 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 185 మందికి 184 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

శాలిగౌరారం, మే 2 : మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన శీతాల అంజయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అందించారు. కార్యక్రమంలో నాయకులు వలిశెట్టి సైదులు, గోదాసు మల్లయ్య, జవ్వాజి నాగరాజు, భూషణం, గద్దల ముత్తయ్య పాల్గొన్నారు.

## ఆటో పల్టీ..ఒకరు దుర్మరణం

నార్కట్‌పల్లి, మే 2 : మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఆటో పల్టీ కొట్టడంతో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణ వెల్లెంల గ్రామానికి చెందిన మారయ్య(75) సొంత పనిమీద నార్కట్‌పల్లికి వచ్చాడు. తిరిగి ఆటోలో సొంతూరికి వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో గ్రామ శివారులో ఆటో పల్టీ కొట్టింది. దాంతో మారయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మిర్యాలగూడలో సభ ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, మే 2: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 4న సాయంత్రం పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో నిర్వహించే సభతోపాటు సింగర్ మంగ్లీ ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట నాయకులు చిలుకూరు బాలు, నూకల వేణుగోపాల్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, గోదాల జానకిరాంరెడ్డి, మేకల శ్రీనివాస్ ఉన్నారు.

**జాతర ఏర్పాట్లపై సమీక్ష**

మిర్యాలగూడ : ఈ నెల 17 నుంచి 19 వరకు దామరచర్లలోని కల్లేపల్లి బంగారు మైసమ్మ ఆలయంలో నిర్వహించే జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీటి సదుపాయం, నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో కల్లేపల్లి మాజీ సర్పంచ్ జనార్దన్, ఈఓ కొండల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దస్రూనాయక్, నెహ్రూ, ఎర్రనాయక్ పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ పోటీదారుల సాగర్ టూర్ ట్రయల్ రన్




ట్రయల్ రన్‌లో పాల్గొన్న అధికారులు

నాగార్జునసాగర్, మే 2: మిస్ వరల్డ్ పోటీదారులు ఈ నెల 12 సాగర్‌కు రానున్న దృష్ట్యా శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించినట్లు బుద్ధవనం ఓఎస్‌డీ సుధాన్‌రెడ్డి తెలిపారు. బుద్ధ పూర్ణిమను పురస్కరించుకొని మిస్ వరల్డ్ పోటీదారులు నాగార్జునసాగర్‌ను సందర్శిస్తున్నందున వారి కోసం విజయవిహార్, బుద్ధవనంలో తగిన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారిని హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్‌కు వోల్వా బస్సుల్లో తీసుకొచ్చి తిరిగి తీసుకెళ్లేందుకు వీలుగా శుక్రవారం టూరిజం అధికారులు ట్రయల్‌రన్ నిర్వహించారు. అందులో భాగంగా ఒక బస్సును టూరిజం అధికారులు సాగర్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ సుధాన్‌రెడ్డి మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీదారులను హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు బస్సుల్లో తీసుకువచ్చి తిరిగి తీసుకెళ్లే ప్రక్రియలో ఎంత సమయం పడుతుంది, ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేందుకు వీలుగా రూట్ మ్యాప్ కోసం ట్రయల్ రన్ నిర్వహించినట్లు చెప్పారు. ఇది పూర్తిగా విజయవతమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో టూరిజంశాఖ ఎస్ఈ భాస్కర్‌రావు, పెద్దవూర తాసీల్దార్ శ్రీనివాస్, సాగర్ సీఐ శ్రీను నాయక్, సాగర్ ఎస్ఐ సంపత్‌గౌడ్, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## పాటల పోటీ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

రామగిరి, మే 1: జిల్లా కేంద్రంలోని లయన్స్ భవనంలో శుక్రవారం నిర్వహించిన క్రైస్తవ పాటల పోటీల్లో విజేతలను సన్మానించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ గాయకుడు పీజేడీ కుమార్, టీడీఆర్‌టుడే నిర్వాహకుడు తెలగమల్ల దశరథ, పోటీల సమన్వయ కర్త జోసఫ్ కొండ, సందర్శిని పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై విమర్శలు మాని హామీల అమలుపై దృష్టి పెట్టాలి

● బీఆర్‌ఎస్ నాయకుడు గిరి నేత

మర్రిగూడ, మే 2 : సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు చేయడం మాని ప్రజలకిచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సంగెపు గిరినేత హితవు పలికారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాల్లో కూడా రేవంత్‌రెడ్డి తన హోదాను దిగజార్చుకునేలా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వరంగల్ సభలో రేవంత్‌రెడ్డి ప్రస్తావన తేలేదనే అక్కసుతో కేసీఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, కేసీఆర్ ఎవరికో భయపడే వ్యక్తి కాదని, స్థాయి లేని వ్యక్తుల గురించి ఆయన పట్టించుకోడని పేర్కొన్నారు. రజతోత్సవ సభలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట వాస్తవమేనని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులపై పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని హితవు పలికారు.

## ఎయిర్‌పోర్టులో ప్రయాణికుడు మృతి

శంషాబాద్ రూరల్, మే 2 : రాంచి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జరిగింది. ఎయిర్‌పోర్టు అవుట్‌పోస్టు సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఆజాద్(47) బీదర్‌లోని షాహిన్ విశ్వవిద్యాలయంలో రెండో సంవత్సరం చదువుతున్న తన కూతురు నస్రీంను కళాశాలకు పంపించడం కోసం గురువారం రాంచి నుంచి ఇండిగో విమానంలో శంషాబాద్‌కు చేరుకున్నాడు. ఎయిర్‌పోర్టులోని ఫిల్లర్ నంబర్ రెండు వద్దకు రాగానే ఒక్కసారిగా కిందపడిపోయాడు. అపోలో దవాఖానకు తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలు



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో కురుస్తున్న వర్షం



చిన్నఅడిశర్లపల్లి ఈదురు గాలులకు దెబ్బతిన్న రేకులు



కొండమల్లేపల్లి : పాతగ్రామంలో ఇండ్ల మీద కూలిన 33 కేవీ లైన్

మర్రిగూడ, మే 2 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షానికి పంట చేలు దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో కోత దశలో ఉన్న వరి చేలు నేల వాలాయి. ధాన్యం రాలిపోయి తీవ్ర నష్టం ఏర్పడిందని రైతులు తెలిపారు. మర్రిగూడకు చెందిన రైతులు బోయపల్లి శ్రీకాంత్, రాములు, కొంతం దామోదర్‌రెడ్డి, మోదుగు రాజేందర్‌కు చెందిన 50ఎకరాలకు పైగా వరి పొలాలు పూర్తిగా దెబ్బతిన్నట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

**కొండమల్లేపల్లిలో గాలివాన**

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులతో పాత పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దాంతో పాటు 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం కూలిపోవడంతో వైర్లు ఇంటిమీద పడ్డాయి. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరుగలేదు. దాంతో మండల కేంద్రంలో సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నలిచిపోయింది. మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామలోని ఇంజినీరింగ్ వర్క్‌షాపు రేకులు లేచి పోయాయి.